సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



సిట్టింగ్‌లకే ప్రాధాన్యం
బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తమ పార్టీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేశారు. ఈసారి కూడా సిట్టింగ్‌లకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. చాలా మంది మూడోసారి బరిలో దిగనున్నారు. 8లో



బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి
బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ముత్తంగి గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 9లో



దివ్యాంగులు నిరుత్సాహపడొద్దు
దివ్యాంగులు నిరుత్సాహపడకుండా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని టీఎస్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. 9లో

గులాబీ రేసుగుర్రాలు



ఉమ్మడి జిల్లాలో 10 స్థానాలకు అభ్యర్థిత్వాలు ఖరారు

- చర్చనీయాంశంగా కేసీఆర్ కామారెడ్డి ఎంపిక నిర్ణయం
- సిద్దిపేట బరిలో ఏడోసారి మంత్రి హరీశ్‌రావు
- సంగారెడ్డి నుంచి చింతా ప్రభాకర్
- పటాన్‌చెరువు నుంచి గూడెం మహిపాల్‌రెడ్డి
- అందోల్‌లో చంటి క్రాంతికిరణ్
- నారాయణఖేడ్, జహీరాబాద్ టిక్కెట్లు సిట్టింగ్‌లకే..
- పద్మాదేవేందర్‌రెడ్డికి దక్కిన మెదక్ టిక్కెట్
- దుబ్బాక బరిలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి
- హుస్నాబాద్‌లో సతీశ్‌కుమార్
- నర్సాపూర్‌పై కొనసాగుతున్న ఉత్కంఠ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అధికార బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిత్వాలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 స్థానాల్లో.. ఒక్క నర్సాపూర్ మినహా మిగిలిన పది స్థానాలకు అభ్యర్థిత్వాలు ఖరారు అయ్యాయి. ఈసారి కూడా దాదాపు సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికి టిక్కెట్లు దక్కాయి.

గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలోనూ..



గజ్వేల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న **ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు** ఈసారి కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ గజ్వేల్‌ను వీడి., కామారెడ్డిలో పోటీ చేస్తారని గతంలోనే చర్చ జరిగింది. కానీ రెండు చోట్ల బరిలోకి దిగాలని గులాబీ పార్టీ అధినేత నిర్ణయం తీసుకున్నారు.

ఏడోసారి సిద్దిపేట బరిలో హరీశ్‌రావు..



ఓటమెరుగని నేతగా పేరున్న **మంత్రి హరీశ్‌రావు** సిద్దిపేట నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. ఆరుసార్లు ఘన విజయాలు సాధించిన ఆయన ఈసారి కూడా భారీ మెజారిటీతో విజయం సొంతం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. సిద్దిపేట నియోజకవర్గాన్ని అభివృద్ధికి మారుపేరుగా తీర్చిదిద్దారు.

దుబ్బాకకు 'కొత్త'..



దుబ్బాక స్థానానికి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పేరును ఖరారు చేస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. దుబ్బాక ఉప ఎన్నిక తర్వాత ప్రభాకర్‌రెడ్డి ఈ నియోజకవర్గంపైనే దృష్టి సారించారు. ఈ స్థానం నుంచి సోలిపేట రామలింగారెడ్డి కుటుంబసభ్యులు అభ్యర్థిత్వం ఆశించినప్పటికీ.. కొత్త ప్రభాకర్‌రెడ్డికే అభ్యర్థిత్వం దక్కింది.

సతీశ్‌కే హుస్నాబాద్



హుస్నాబాద్ నియోజకవర్గం అభ్యర్థిత్వం సిట్టింగ్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కే దక్కింది. ఆయన మూడోసారి హుస్నాబాద్ నుంచి బరిలో నిలువనున్నారు. వామపక్ష పార్టీలతో పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని సీపీఐకి వెళుతుందనే ప్రచారం జరిగింది. కానీ సతీశ్‌అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు.

మెదక్ నుంచి పద్మాదేవేందర్‌రెడ్డి



మెదక్ నుంచి పద్మాదేవేందర్‌రెడ్డికి మరో మారు అవకాశం కల్పించారు. ఇక్కడి టిక్కెట్‌ను ఎమ్మెల్సీ శేరిసుభాష్ రెడ్డితో పాటు, మైనంపల్లి రోహిత్ కూడా ఆశించారు. కొన్ని నెలలుగా రోహిత్ సేవా కార్యక్రమాలు చేపట్టారు. అయితే అధినేత కేసీఆర్ పద్మ దేవేందర్‌రెడ్డికే టిక్కెట్ కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

'ఖేడ్'బరిలో భూపాల్‌రెడ్డి..



నారాయణఖేడ్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎం.భూపాల్‌రెడ్డి బరిలోకి దిగనున్నారు. ఈ స్థానాన్ని పెద్ద శంకరంపేట మండలానికి చెందిన విగ్రం శ్రీనివాస్‌గౌడ్ ఆశించారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికే ఖరారు చేస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు.

జహీరాబాద్ మాణిక్‌రావుకే..



జహీరాబాద్ అభ్యర్థిత్వానికి పోటాపోటీ నెలకొన్నప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుకు ఖరారైంది. ఇక్కడ టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రైతు ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్, ఇటీవల కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన నరోత్తంలు ఆశించారు. చివరకు మాణిక్‌రావుకు ఖరారు చేస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు.



జహీరాబాద్‌లో బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు

నర్సాపూర్‌పై కొనసాగుతున్న ఉత్కంఠ



నర్సాపూర్ నియోజకవర్గం అభ్యర్థిత్వంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించని నాలుగు స్థానాల్లో నర్సాపూర్ ఒకటి. ఈ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డితో పాటు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి టిక్కెట్ కోసం నువ్వా నేనా అన్నట్లుగా ప్రయత్నిస్తున్నారు. ఇరువురు కూడా మంత్రి హరీశ్‌రావుతో పాటు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి తమ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 23న సీఎం కేసీఆర్ మెదక్ పర్యటన అనంతరం ఈ స్థానంపై స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పటాన్‌చెరు ముందుగా ప్రకటించినట్లుగానే..



పటాన్‌చెరు టిక్కెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి దక్కింది. మహిపాల్ రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని సీఎం కేసీఆర్ ఇటీవల పటాన్ చెరువులో జరిగిన బహిరంగసభలో ప్రకటించారు. అన్నట్లుగానే ఆయనకే అభ్యర్థిత్వం ఖారారు చేశారు. ఇక్కడ చిట్కుల్ సర్పంచ్ నీలంమధు బీఆర్‌ఎస్ టిక్కెట్ ఆశించారు. సేవా కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లో ఉంటున్న మధు.. తనకు సీఎం కేసీఆర్ తప్పకుండా న్యాయం చేస్తారనే ధీమాతో ఉన్నప్పటికీ, మహిపాల్‌రెడ్డికే టిక్కెట్ వరించింది.

సంగారెడ్డి చింతాకే..



సంగారెడ్డి నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్‌కే దక్కింది. ఈ స్థానంపై తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. సంగారెడ్డి ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరుతారని, అభ్యర్థిత్వం కూడా దక్కుతుందనే ప్రచారం కొన్ని నెలలుగా జరిగింది. ఈ ఉత్కంఠకు తెరదించుతూ సీఎం కేసీఆర్ చింతా ప్రభాకర్‌కే అభ్యర్థిత్వం ఖరారు చేశారు. గత ఎన్నికల్లో చింత ప్రభాకర్ స్వల్ప ఓట్లతో ఓడిపోయినప్పటికీ, నాలుగున్నరేళ్లుగా ఆయన ప్రజల్లోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు మరోమారు అభ్యర్థిత్వం దక్కింది.

క్రాంతి కిరణ్‌కు రెండోసారి



అందోల్ (ఎస్సీ) నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం చంటి క్రాంతికిరణ్‌కే దక్కింది. టీఎస్ ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ గతంలో ఈ టిక్కెట్‌ను ఆశించినప్పటికీ, అధినేత మాత్రం క్రాంతి కిరణ్‌వైపే మొగ్గు చూపారు. 2018 ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసిన క్రాంతికిరణ్.. ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహపై విజయం సాధించారు.

న్యూస్‌రీల్

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్: వివిధ సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌ఓ నగేష్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 35 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎక్కువగా బీసీ, మైనారిటీలకు లక్ష సాయం, దళిత బంధు, గృహలక్ష్మి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పింఛన్ కోసం దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిక్కు.. లక్కీ



డ్రా తీస్తున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి మున్సిపాలిటీ: 2023–25 సంవత్సరాల గాను మద్యం షాపుల అనుమతికి సోమవారం కలెక్టర్ శరత్ ఆధ్వర్యంలో జేఆర్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో లాటరీ నిర్వహించారు. ఎస్టీలకు 2, ఎస్సీలకు 13, గౌడ కులస్తులకు 9 షాపులను కేటాయించారు. మొత్తం 6,156 దరఖాస్తులు రాగా, అందులో 101 షాపులను కలెక్టర్ శరత్ ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, సీఐ మధు పాల్గొన్నారు.

లోన్ పేరుతో ఫోన్‌కాల్..

- మోసపోయిన వ్యక్తి ఆత్మహత్య...
- 17వ తేదీన అదృశ్యం.. 21న చెరువులో శవమై



మల్లేష్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: లోన్ పేరిట వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించిన వ్యక్తి మోసపోయి ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన మల్లేష్(45) ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా గత వారం తన ఫోన్‌కు రూ.3లక్షల రుణం ఇస్తామంటూ ఫోన్ వచ్చింది. దీంతో మల్లేష్ లోన్ వస్తుందని ఆశతో కొంతనగదు చెల్లించాడు. చివరికి లోన్ ఇస్తామని చెప్పిన వారి ఫోన్ స్విచ్ ఆఫ్ అని సమాధానం రావడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గత గురువారం వెళ్లిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన భార్య సునీత మల్లేష్ ఆచూకీ కోసం బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అదే గ్రామంలోని చిట్కుల్ చెరువులో మల్లేష్ మృతదేహం లభ్యమైంది. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి బాధిత కుటుంబానికి అప్పజెప్పారు.

కేతకిలో కేంద్ర మంత్రి పూజలు



కేంద్ర సహాయ మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో సోమవారం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి భగవత్ కుభా పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, గర్భగుడిలో పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు.

భక్తుల సందడి..

శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వైన్స్ షాపుల డ్రా ఉండటంతో దరఖాస్తు చేసుకున్న వారు ఆలయానికి వచ్చి లైసెన్స్ రావాలని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫొటో దిగుతానని

- మంజీరాలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- కాపాడిన జాలర్లు

మనూరు (నారాయణఖేడ్): మనూరు మండలం రాయిపల్లి వద్ద మంజీరా నది వంతెన పైనుంచి ఓ వ్యక్తి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. జహీరాబాద్ సమీపంలోని పస్తాపూర్‌కు చెందిన వడ్ల నర్సింలు(50) రాయిపల్లిలోని తన అక్క నర్సమ్మ ఇంటికి కుటుంబ సమేతంగా కారులో వచ్చారు. తిరుగు ప్రయాణంలో వంతెన పైకి వెళ్లగానే కారులో ఉన్న బిడ్డ, అల్లుడు, భార్యలకు తాను ఫొటో దిగుతానని నమ్మబలికి వంతెన పైన కారును నిలిపారు. అనంతరం తన చేతిలోని ఫోన్‌ను కారులో పడేసి నదిలోకి దూకాడు. దీంతో కుటుంబ సభ్యులు కేకలు వేయగా.. అక్కడే ఉన్న జాలర్లు కాపాడారు. ఆత్మహత్యాయత్నానికి కుటుంబ తగాదాలే కారణమని తెలుస్తోంది.



నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన మత్స్యకారులు

నిద్ర లేవలేదని..

- ఇద్దరు పిల్లలపై వేడినీళ్లు పోసిన తల్లి
- ఒకరి పరిస్థితి విషమం
- మెదక్ జిల్లా ఎల్కపల్లిలో దారుణం

వెల్దుర్తి(తూప్రాన్): నిద్రలేవలేదనే కారణంతో ఇద్దరు చిన్నారులపై ఓ తల్లి వేడినీటిని గుమ్మరించింది. దీంతో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ కథనం ప్రకారం.. ఎల్కపల్లికి చెందిన ఎంచర్ల సంతోష, సాయిలు దంపతులకు ఇద్దరు సంతానం. భార్యాభర్తల మధ్య కొన్ని నెలలుగా వివాదాలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో నిద్ర లేవలేదనే కారణంతో చిన్నారులు శ్రీనిధి, రిత్విక్‌లపై మరిగేనీటిని పోసింది. ఈ ఘటనలో పొట్ట, ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రిత్విక్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



చికిత్స పొందుతున్న రిత్విక్, శ్రీనిధి

లెఫ్ట్‌కు నో లిఫ్ట్

- హుస్నాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సతీశ్‌కుమార్
- పొత్తు కోసం చూసిన సీపీఐకి నిరాశ

సాక్షి, సిద్దిపేట: బీఆర్‌ఎస్‌తో పొత్తుపై ఆశలు పెట్టుకున్న కామ్రేడ్లకు నిరాశే మిగిలింది. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో వామపక్షాల మద్దతుతో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపొందారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్, సీపీఐ మధ్య స్నేహబంధం కొనసాగుతోంది. పొత్తులో భాగంగా అడిగే సీట్లలో హుస్నాబాద్ నియోజకవర్గం ముఖ్యమైంది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన 115 ఎమ్మెల్యే అభ్యర్థుల్లో హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పేరును ఖరారు చేయడంతో సీపీఐ నేతల ఆశలు గల్లంతయ్యాయి.

పొత్తు ఎవరితో..?

ఇటీవల మంత్రి హరీశ్‌రావు ఓ కార్యక్రమంలో కమ్యూనిస్టులకు కార్యకర్తలు లేరని ప్రసంగించారు. అప్పటి నుంచి వామపక్షాలను దూరం పెట్టినట్లుగా కన్పించింది. హుస్నాబాద్ నుంచి సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆ పార్టీ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి పోటీ చేయాలని పట్టుదలతో ఉన్నారు. సీపీఐ బస్సుయాత్ర ముగింపు సభను మే నెలలో హుస్నాబాద్‌లో నిర్వహించి సీపీఐ తప్పక పోటీ చేస్తుందని ప్రకటించారు. బీఆర్‌ఎస్‌తో పొత్తు లేకపోవడంతో ఒంటరిగానే పోటీ చేస్తారా, పొత్తు పెట్టుకుంటారా... అని చర్చ సాగుతుంది. మరోవైపు హుస్నాబాద్ నుంచి సీపీఐ జాతీయ నాయకుడు వెంకట్‌రెడ్డి పోటీ చేయాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలో పోరాటాలు నిర్వహిస్తూ నిత్యం ప్రజల మధ్య ఉంటున్నారు.

టోకెన్ చూపి వైన్ షాపులు కేటాయింపు

తిగుల్ నర్సాపూర్ లక్కీ డ్రాపై అభ్యంతరం



టోకెన్ చూపుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నూతన మద్యం పాలసీ 2023–25 సంవత్సరాల కాలపరిమితితో కూడిన మద్యం షాపుల లైసెన్సుల జారీకి లాటరీ పద్ధతిలో కేటాయించారు. సోమవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ చేతుల మీదుగా విపంచి కళానిలయంలో లక్కీ డ్రా నిర్వహించారు. జిల్లాలోని 93 మద్యం షాపులకుగాను మొత్తం 4,166 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీసి షాపులు కేటాయించారు. లక్కీ డ్రా టోకెన్ అందరికీ చూపిస్తూ పారదర్శకంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రక్రియ ఆద్యంతం ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. భారీగా దరఖాస్తుదారులు రావడంతో టోకెన్ ఉన్న వారినే లోనికి అనుమతించారు. కళానిలయంతోపాటు పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తిగుల్ నర్సాపూర్ మద్యం షాపునకు నిర్వహించిన లాటరీలో 99 టోకెన్ వచ్చిందంటూ అధికారులు ప్రకటించారు. కాగా 66వ టోకెన్ దరఖాస్తుదారులు తమకే వచ్చిందంటు అధికారుల వద్దకు వెళ్లారు. అధికారులు 99 టోకెన్ వచ్చిందని తెలుపగా, 66 టోకెన్ దరఖాస్తుదారులు వీడియో చూపాలని అధి కారులను కోరారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సీఐలు, ఎక్సైజ్ ఎస్ఐలు పాల్గొన్నారు.

మైనంపల్లి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

నారాయణఖేడ్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆర్థికశాఖ మంత్రి టి.హరీశ్‌రావుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మైనంపల్లి హన్మంతరావు క్రమశిక్షణను వీడి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదని, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్నారు. ఆయన తన కుమారుడికి టికెట్ దక్కకపోవడంతో విచక్షణ లేకుండా మాట్లాడటం మానుకోవాలన్నారు. మంత్రి హరీశ్‌రావుకు ప్రజల అండదండలు ఉన్నంతకాలం మైనంపల్లి లాంటివారు ఏమీ చేయలేరన్నారు.

నమ్మకాన్ని వమ్ము చేయను

- టిక్కెట్ దక్కడం సంతోషాన్నిచ్చింది
- ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు
- ఆశించి భంగపడ్డ నరోత్తం, ఢిల్లీ వసంత్

జహీరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు జహీరాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు తనకు మరోమారు టిక్కెట్ కేటాయించడం సంతోషాన్ని కలిగించిందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. జహీరాబాద్ ప్రజలకు మరో పర్యాయం సేవచేసే భాగ్యం కలిగిందన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో పాటు పడ్డానని, తిరిగి ప్రజలు తనకు భారీ మెజార్టీతో విజయాన్ని అందించనున్నారన్నారు. తమ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తోందని చెప్పారు. అభివృద్ధికి సైతం పెద్ద పీట వేసిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని కార్యక్రమాలను ముఖ్యమంత్రి కేసీఆర్ చేశారన్నారు. సీఎం కేసీఆర్ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరో మారు భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని, సీఎం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయమోనని స్పష్టం చేశారు.

త్వరలో భవిష్యత్ కార్యాచరణ: ఢిల్లీ వసంత్

జహీరాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఢిల్లీ వసంత్ టికెట్‌ను ఆశించినా దక్కలేదు. టికెట్ ఆశంతో ఇటీవల మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. టికెట్ రానందున అభిమానులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని ఢిల్లీ వసంత్ అన్నారు. రెండున్నర సంవత్సరాల కాలంగా రాజకీయ కార్యకలాపాల్లో ప్రజలతో కలిసి చురుకుగా పనిచేశానన్నారు. ప్రజలు తనను ఎమ్మెల్యేగా చూడాలని భావించి సహకారం అందించారన్నారు. 16 సంవత్సరాలుగా ప్రజా క్షేత్రంలో ఉండి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు, చెరకు రైతుల సమస్యలపై పోరాటాలు చేశానన్నారు. రాజకీయం అనేది రక్తం లేని యుద్ధం, ఈ యుద్ధం ఇంకా మిగిలే ఉందన్నారు. భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానని వసంత్ పేర్కొన్నారు.

నరోత్తంను నిరాశపర్చిన అధిష్టాన నిర్ణయం

ఎమ్మెల్యే టికెట్ కోసం గట్టి కృషి చేసినా వై.నరోత్తంకు బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టాన వర్గం తీసుకున్న నిర్ణయం తీవ్ర నిరాశకు గురిచేసింది. టికెట్ ఆశతో ఆయన ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి రాజకీయ భవితవ్యాన్ని పరీక్షించుకునేందుకు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. టికెట్ కేటాయించే విషయంలో సీఎం కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మాణిక్‌రావు వైపే మొగ్గుచూపారు. ఈ సందర్భంగా నరోత్తం మాట్లాడుతూ పార్టీలో చేర్చుకునే ముందు టికెట్ కేటాయించే విషయం ప్రస్తావనకు వచ్చిందన్నారు. ముందు ముందు పార్టీ ఎలాంటి ప్రాధాన్యత కల్పిస్తుందనే విషయమై వేచి చూస్తానని పేర్కొన్నారు.

అధిష్టానం పునరాలోచించాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత నీలం మధు

- పటాన్‌చెరు అభ్యర్థిత్వంపై నీలం మధుముదిరాజ్ విజ్ఞప్తి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికపై బీఆర్‌ఎస్ అధిష్టానం పునరాలోచించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని తన కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ఎస్ఎంఆర్ యువసేన నాయకులు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. పార్టీకి నిరంతరం కృషి చేస్తున్న తనకు అవకాశం కల్పించకపోవడంతో భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 60 లక్షల మంది ముదిరాజ్‌లు ఉండగా ఒక్క సీటు కేటాయించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధిష్టానం పునరాలోచించుకునేందుకు రెండు రోజులు వేచి చూద్దామన్నారు. అధిష్టానం నుంచి పూర్తి స్థాయిలో స్పష్టత తీసుకున్నాకే ఏం చేయాల నేది ఆలోచిద్దామని చెప్పారు. స్వతంత్రంగా పోటీ చేద్దామా, లేక ఏ పార్టీతోనైనా కలిసి వెళదామా అనేది కార్యాచరణ రూపొందించుకుందామని తెలిపారు. కాగా నీలం మధు బీఆర్‌ఎస్‌ను వీడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

ప్రేమ విఫలమై వ్యక్తి ఆత్మహత్య



రాజు

అల్లాదుర్గం(మెదక్): ప్రేమ విఫలమై ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన అల్లాదుర్గం వడ్డేర కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డేర రాజు(22), పాపన్నపేటకు చెందిన యువతి ఏడాదిగా ప్రేమలో ఉన్నారు. ఇటీవల సంగారెడ్డిలో ఇద్దరూ కలిసి ఉంటున్నారు. ఎందుకో రాజుతో ప్రేమ వద్దనుకుని ఆమె వెళ్లిపోయింది. ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురై అతడు ఆదివారం రాత్రి అల్లాదుర్గంలో ఉన్న ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

హవేళీఘనపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ మండల పరిధిలోని ఖాజిపల్లిలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంగళి శంకర్(40) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఇంటిని కొన్నాడు. దీంతో అప్పులు కావడంతో ఈ విషయమై కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరిగేవి. తీవ్ర మనస్తాపానికి గురైన శంకర్ సోమవారం కుటుంబ సభ్యులను నిద్రలేపి ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

మాటు వేసి.. మాజీ సర్పంచ్‌పై దాడి

- 12 మందిపై అట్రాసిటీ కేసు

అల్లాదుర్గం(మెదక్): పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని మాటు కాసి మాజీ సర్పంచ్‌పై దాడి చేశారు. ఈ సంఘటనలో 12 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ సంఘటన ఆదివారం రాత్రి కాయిదంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిబాబా.. పాపన్నపేట మండల ఏడుపాయల గుడి వద్ద విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, పోచయ్య గొడవపడ్డారు. వీరిని సముదాయించి అక్కడి నుంచి పంపివేశారు. తర్వాత కాయిదంపల్లిలో బాల్‌రాజ్ కోసం పోచయ్య తన అనుచరులతో మాటు వేశాడు. అతను గ్రామానికి చేరుకోగానే కూల దూషణ, అసభ్యపదజాలంతో తిడుతూ దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు యాటకారి నాగరాజు, యాటకారి పోచయ్య, దస్తయ్య, దొంతరబోయిన బాగయ్య, నాగయ్య, నాగారం శివయ్య, కృష్ణ, కేశయ్య, వెంకయ్య, యాదగిరి, పెద్దరాజులపై ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సోమవారం కాయిదంపల్లిలో మెదక్ డీఎస్పీ ఫణీందర్ విచారణ చేశారు.

క్షణికావేశానికి నిండు ప్రాణం బలి

పెద్దశంకరంపేట(మెదక్): క్షణికావేశానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దశంకరంపేటలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం... వెల్దే పేటకు చెందిన మామిడి సాయికుమార్(23), లక్ష్మి మాధవనగర్‌లో అద్దె కుంటున్నారు. అతను చేపల విక్రయిస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ వ్యవహారాల విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. అనంతరం అక్కడి నుంచి కుమారుడిని తీసుకొని ఆమె పుట్టింటికి వెళ్లింది. అప్పటికే మనస్తాపం చెందిన అతడు క్షణికావేశంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.బాలరాజు తెలిపారు.

సిట్టింగ్‌లకు ప్రాధాన్యం

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తమ పార్టీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేశారు. ఈసారి కూడా సిట్టింగ్‌లకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. చాలా మంది మూడోసారి బరిలో దిగనున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమని ఆ పార్టీ అభ్యర్థులు స్పష్టం చేశారు. ఈసారి కూడా విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు.

గజ్వేల్‌లో కేసీఆర్ మూడోసారి..



ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రొఫైల్
పోటీ చేసే స్థానం : గజ్వేల్
పుట్టిన తేదీ : 17 ఫిబ్రవరి 1954
గ్రామం : చింతమడక, సిద్దిపేట జిల్లా.
భార్య : శోభ
సంతానం : తారక రామారావు (కేటీఆర్), కవిత.
విద్యార్హత : ఎంఏ (తెలుగు లిటరేచర్).

ముచ్చటగా మూడోసారి గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నారు. అంతకంటే ముందు సిద్దిపేట ఎమ్మెల్యేగా, మెదక్, కరీంనగర్, మహబూబ్‌నగర్ ఎంపీగా గెలుపొందారు. గజ్వేల్ నియోజకవర్గం సెంటిమెంట్‌గా భావించి పోటీ చేస్తున్నారు. గజ్వేల్ నుంచి రెండు మార్లు పోటీ చేసి గెలుపొంది సీఎం అయ్యారు. రెండుసార్లు ఆయన పై పోటీ చేసిన ప్రతాప్‌రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం సంఖ్య 42 ... సెంటిమెంట్ దృష్ట్యా 6 వస్తుండటంతో లక్కీ నంబర్‌గా కలిసి వస్తుండటంతో మూడోసారి ఇక్కడి నుంచే పోటీ చేస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. అలాగే రిజర్వాయర్‌లను నిర్మించి బీడు భూములను సాగులోకి తెచ్చారు. కాగా కామారెడ్డి నుంచి సైతం పోటీ చేస్తున్నారు.

ఏడోసారి బరిలో హరీశ్ రావు



తన్నీరు హరీశ్‌రావు ప్రొఫైల్
పోటీ చేసే స్థానం : సిద్దిపేట
జననం: జూన్ 3, 1972
స్టడీ: డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్
పుట్టింది: చింతమడక గ్రామం, సిద్దిపేట
తల్లిదండ్రులు : సత్యనారాయణరావు, లక్ష్మీబాయి

సాక్షి సిద్దిపేట : సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఏడోసారి బరిలో ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు నిలవనున్నారు. సీఎం కేసీఆర్ తర్వాత సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం 2004 అక్టోబర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి 24,827 ఓట్ల మెజార్టీ, 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిపై 58,935 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2009లో జరిగిన ఎన్నికల్లో 64,014 ఓట్ల మెజార్టీతో, 2009 డిసెంబరు 9 లో ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రక్రియ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నందుకు నిరసనగా 2010 మొదట్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో 95,858 ఓట్లతో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నుంచి 93,328 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి, ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గంలో భారీ నీటి పారుదల, మార్కెటింగ్, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో సిద్దిపేట నుంచి 1,18,699 ఓట్లతో రికార్డు మెజార్టీతో విజయం సాధించి, 2019 సెప్టెంబర్ 8న ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గంలో ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2021, నవంబరు 9న హరీశ్ రావుకు ఆరోగ్యశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలను సీఎం కేసీఆర్ అప్పగించారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి హరీశ్‌రావును సీఎం కేసీఆర్ ప్రకటించారు.

మూడోసారి ఎన్నికల బరిలో.. పద్మా దేవేందర్‌రెడ్డి



భర్తతో సంతోషం పంచుకుంటున్న ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి

మెదక్: ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి మూడోసారి టికెట్ దక్కించుకున్నారు. 2001లో జెడ్పీటీసీగా, 2004లో రామాయంపేట ఎమ్మెల్యేగా గెలిచారు. 2008 ఉప ఎన్నికల్లో టీడీపీ, టీఆర్‌ఎస్ పొత్తులో భాగంగా మెదక్ నుంచి మైనంపల్లి హన్మంతరావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 2009లో టీడీపీ, టీఆర్‌ఎస్ ఉమ్మడి కూటమిలో మళ్లీ హన్మంతరావుకే టికెట్ దక్కింది. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమి పాలయ్యారు. అనంతరం 2014లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన పద్మారెడ్డి, ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి విజయ శాంతిపై భారీ మెజార్టీతో గెలిచారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థి ఉపేందర్‌రెడ్డిపై గెలిచారు. ఇప్పుడు మూడోసారి టికెట్ దక్కడంతో హ్యాట్రిక్‌పై దృష్టి సారించారు.

పద్మా దేవేందర్ రెడ్డి ప్రొఫైల్
పోటీ చేసే స్థానం : మెదక్
పుట్టిన తేదీ : 6-1-1969
విద్య : బీఏ ఎల్ఎల్‌బీ
తల్లిదండ్రులు: భూమి రెడ్డి, విజయ
వృత్తి : న్యాయ వ్యాధి 1998-2001
సంతానం : పునీత్ రెడ్డి (కుమారుడు)

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి..



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రొఫైల్
పోటీ చేసే స్థానం : పటాన్‌చెరు
జననం: సెప్టెంబర్ 19, 1963, పటాన్‌చెరు
విద్యార్హత: ఇంటర్మీడియట్
తల్లితండ్రులు: గూడెం మానెమ్మ, కీర్తి శేషులు గూడెం సత్తి రెడ్డి
భార్య : యాదమ్మ
కుమారులు : విష్ణువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి
కుమార్తె : రాజేశ్వరి భర్త : చంద్రశేఖర్‌రెడ్డి

పటాన్‌చెరు: వచ్చే ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పటాన్‌చెరు అభ్యర్థిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించారు. ఆ మేరకు అంబేడ్కర్ చౌరస్తా వద్ద జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, నేతల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. పార్టీశ్రేణులు టపాసులు పేల్చి, ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావు..



మాణిక్‌రావు ప్రొఫైల్
పోటీ చేసే స్థానం : జహీరాబాద్
పుట్టిన తేదీ : 1953 జూలై 9
తల్లిదండ్రులు :లచ్చమ్మ, బాలప్ప
భార్య :మధులత
కుమారులు : మిథున్‌రాజ్, మనిష్‌రాజ్
కుమార్తె :మౌనిక
గ్రామం :ఝరాసంగం
విద్యార్హత :ఇంజినీరింగ్

జహీరాబాద్: ఎమ్మెల్యే కె.మాణిక్ రావుకు బీఆర్ఎస్ నుంచి వరుసగా మూడోసారి టికెట్ వరించింది. మొదటిసారి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. రెండోసారి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో తొలిసారి జహీరాబాద్ అసెంబ్లీ టీఆర్ఎస్ టికెట్ దక్కించుకున్నారు. ఆ ఎన్నికల్లో 842 ఓట్ల స్వల్ప తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి జె.గీతారెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో మాణిక్‌రావు తిరిగి రెండోసారి టీఆర్ఎస్ టికెట్ దక్కించుకున్నారు. ఆ ఎన్నికల్లో గీతా రెడ్డిపై 34,473 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచారు. ఇప్పుడు మూడోసారి పోటీ చేసే అవకాశం కల్పించింది.

హ్యాట్రిక్ సాధిస్తా!



మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రొఫైల్
పోటీ చేసే స్థానం : నారాయణఖేడ్
గ్రామం: ఖానాపూర్(కె), కల్హేర్ మండలం
జననం: 7 మే 1960
తండ్రి: మహారెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే
తల్లి: మహారెడ్డి శకుంతలమ్మ మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ
విద్యార్హత : డిగ్రీ (బీఎస్సీ) ఏవీ కళాశాల, హైదరాబాద్

కల్హేర్(నారాయణఖేడ్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ తరపున పోటీ చేసి హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ఎమ్మెల్యే ఎం.భూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని బీబీపేటకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు అంజిరెడ్డి, ఎల్లాగౌడ్, ఉప్పరి గోపాల్, కాస్లాబాద్ సాయిలు, పాపయ్య, అశోక్ తదితరులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ, అబద్దాలు చెప్పి ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులకు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కులం, మతం పేరిట రాజకీయం చేసే వారిని సహించొద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ రవీందర్ రెడ్డి, నాయకులు కిషన్‌రెడ్డి, మారపు సాయిలు, సమద్ పాల్గొన్నారు.

రెండోసారి బరిలో క్రాంతి కిరణ్



చంటి క్రాంతికిరణ్ ప్రొఫైల్
పోటీ చేసే స్థానం : అందోల్
తండ్రి : భూమయ్య
తల్లి : కొమురమ్మ
గ్రామం: పోతులబోగుడా, వట్‌పల్లి మండలం, సంగారెడ్డి
పుట్టిన తేదీ : 1976 డిసెంబర్ 6
విద్యార్హత: బీఏ, ఎల్ఎల్‌బీ

వట్‌పల్లి(అందోల్): 2018 సార్వత్రిక ఎన్నికల్లో అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా క్రాంతి కిరణ్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహపై 16వేలకు పైగా ఓట్ల మెజార్టీతో మొదటిసారి విజయం సాధించారు. వచ్చే ఎన్నికల్లో రెండోసారి అందోల్ బరిలో దిగనున్నారు.

మూడోసారి ఎగిరేది గులాబీ జెండా



పేరు : వొడితెల సతీష్‌కుమార్
పోటీ చేసే స్థానం : హుస్నాబాద్
తండ్రిదండ్రులు : కెప్టెన్ లక్ష్మికాంతారావు (మాజీ రాజ్యసభ సభ్యుడు), సరళాదేవి (లేట్)
భార్య: డాక్టర్ షమిత, కాకతీయ వర్సిటీ వరంగల్‌లో అసిస్టెంట్ జువాలజీ ప్రొఫెసర్
సంతానం : కుమారుడు ఇంద్రనీల్, కూతురు డాక్టర్ పూజిత
గ్రామం : సింగాపురం, హుజురాబాద్, కరీంనగర్
పుట్టినతేదీ : 30.09.1965
విద్యార్హత : ఇంజినీరింగ్

హుస్నాబాద్: 'హుస్నాబాద్‌లో మూడోసారి ఎగిరేది గులాబీ జెండానే. ప్రభుత్వం సంక్షేమ పథకాలే ఎజెండాగా వచ్చే ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో నడిపిస్తూ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకొని వారి వెన్నంటే ఉన్నా. ఈసారి భారీ మెజార్టీ ఇస్తారని ధీమాతో భవిష్యత్ కార్యాచరణతో ముందుకెళ్తాను. నాపై నమ్మకం ఉంచిన సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు కృతజ్ఞతలు.' అని సతీష్‌కుమార్ తెలిపారు.

గెలిచి సీఎంకు కానుకగా ఇస్తా..



'నాపై నమ్మకంతో వచ్చే ఎన్నికల్లో దుబ్బాక టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉంది. దుబ్బాక ప్రజల ఆశీస్సులతో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తా. నియోజకవర్గ ప్రజలు చాలా చైతన్య వంతులు. ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు రుణపడి ఉంటా అన్నారు.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి

కేసీఆర్‌కు రుణ పడి ఉంటా..

'మూడోసారి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటా. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తా. కేటీఆర్‌కు, హరీశ్‌రావుకు, కొత్త ప్రభాకర్ రెడ్డికి మహిపాల్‌రెడ్డి కృతజ్ఞతలు'. – మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే పటాన్‌చెరు



సంబరాలు జరుపుకుంటున్న నేతలు

ఆపత్కాలంలోనూ అండగా ఉన్నా..

- సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: గత ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ నాలుగున్నరేళ్లు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉన్నానని సంగారెడ్డి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. ఈసారి ప్రజలు ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. సంగారెడ్డి బీఆర్ఎస్ టిక్కెట్ ఖరారైన సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఇక్కడ గెలిచిన ప్రజాప్రతినిధి నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా, నాలుగేళ్లుగా ముఖం చాటేశారని విమర్శించారు. తాను మాత్రం ప్రజలతోనే మమేకమై ఉన్నానని చెప్పారు. కరోనా వంటి ఆపత్కాలంలోనూ ప్రజలకు అండగా నిలిచి వారికి భరోసా కల్పించానని గుర్తు చేశారు. నియోజకవర్గంలో రోడ్లు, మిషన్ భగీరథ వంటి తాగునీరు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టానని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందేలా వారధిగా పనిచేశానని అన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలు, మెడికల్ కాలేజీ, మిషన్‌భగీరథ తాగునీటి పథకాలు, రోడ్లు ఇలా అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. మంత్రి హరీశ్ రావు సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దుబ్బాకకు 'కొత్త'

- ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి టికెట్ ఖరారు
- సోలిపేట కుటుంబానికి దక్కని అవకాశం

సాక్షి, సిద్దిపేట: బీఆర్ఎస్ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. అందులో భాగంగానే సోమవారం 115 మందితో మొదటి జాబితాను సీఎం కేసీఆర్ ప్రకటించారు. ప్రకటించిన వారిలో మూడు సిట్టింగ్‌లు కాగా మరోక స్థానం నుంచి ఎంపీని బరిలో దింపుతున్నారు. ఇంకా జనగామ నియోజకవర్గం పెండిగ్‌లో ఉంది.

దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్ రెడ్డిని టికెట్ దక్కింది. మెదక్ ఎంపీ ప్రభాకర్ రెడ్డి దుబ్బాక పైనే ప్రత్యేకంగా అభివృద్ధి, అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటున్నాడు. 2001లో మలిదశ తెలంగాణ ఉద్యమంలో రామలింగారెడ్డి కీలక పాత్ర పోషించారు. 2004లో టీఆర్ఎస్ తరుపున దొమ్మాట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి సోలిపేట రామలింగారెడ్డి గెలుపొందారు. 2008 ఎన్నికల్లో మళ్లీ గెలిచిన ఆయన 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. 2014, 2018ల్లో జరిగిన ఎన్నికల్లో గెలుపొందారు. 2020లో మరణించిన తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ తరుపున సోలిపేట సుజాతను బరిలోదింపారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. తర్వాత కొన్ని రోజుల తర్వాత నుంచి దుబ్బాకలో రామలింగారెడ్డి కుమారుడు సతీష్, సుజాతలు ఇద్దరు పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సైతం సోలిపేట కుటుంబానికి టికెట్ దక్కలేదు.

పెండింగ్‌లో జనగామ

సీఎం కేసీఆర్ ప్రకటించిన మొదటి జాబితాలో జనగామ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తున్నారనేది ప్రకటించలేదు. జనగామ నియోజకవర్గం బీఆర్ఎస్ నుంచి ఎవరు పోటీలో ఉంటారని పెండింగ్‌లో పెట్టారు. ఆ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే యాదగిరి రెడ్డి, ఎమ్మెల్సీ, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్థానిక సంస్థ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలు ముగ్గురు టికెట్ ఆశిస్తున్నారు. తనకే అవకాశం ఇవ్వాలని సోమవారం ఎమ్మెల్సీ కవితను కలిసి యాదగిరిరెడ్డి విన్నవించారు. ఈ ముగ్గురిలో ఎవరికి అవకాశం దక్కుతుందో వేచిచూడాలి. కాగా దుబ్బాక నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గులాబీ జెండా ఎగురవేస్తామని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడి అన్నారు. తనను ఆశీర్వదించి గెలిపించాలన్నారు.

హల్దీ ప్రాజెక్టులో ఈతకు వెళ్లిన యువకుడి మృతి



సందీప్

వెల్దుర్తి(తూప్రాన్): ఈతకు వెళ్లిన ముగ్గురిలో ఒకరు నీటమునిగి మృతిచెందారు. మిగతా ఇద్దరు అసలు ఏం జరగనట్టు ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ విషయాన్ని గొర్రెల కాపారుల ద్వారా తెలుసుకున్న సర్పంచ్ నిలదీయడంతో సమాచారం బయటికొచ్చింది. ఈ ఘటన వెల్దుర్తిలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై మధుసూదన్ గౌడ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం బొమ్మారానికి చెందిన మెట్టిల నాగరాజు, మెట్టిల శ్రీకాంత్, మెట్టిల సందీప్ ముగ్గురు స్నేహితులు. హకింపేట శివారులోని హల్దీ ప్రాజెక్ట్‌లో ఆదివారం మధ్యాహ్నం ఈతకు వెళ్ళారు. నదిలో దిగిన క్రమంలో నీటి ప్రవాహానికి సందీప్(16) గల్లంతయ్యాడు. ఇది జరిగిన కొద్దిసేపటికి మిగతా ఇద్దరు తమకేమీ తెలియదు అన్నట్లుగా అక్కడి నుంచి గట్టుపై ఉన్న సందీప్ దుస్తులు తీసుకొని ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. రాత్రి పది గంటల సమయంలో కొప్పులపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపారుల ఇచ్చిన సమాచారంతో బొమ్మారం సర్పంచ్ శంకర్ వారిని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం చెప్పారు. గట్టి నిలదీయగా అసలు విషయాన్ని బయటపెట్టారు. దీంతో సోమవారం ఉదయం గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు హల్దీ ప్రాజెక్ట్‌లో వెతకగా మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

115 స్థానాల్లో ముదిరాజ్‌లకేది చోటు

వట్‌పల్లి(అందోల్): బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో ముదిరాజ్ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నారాయణ అన్నారు. సోమవారం జోగిపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 55వేల మంది ఓటర్లున్నారని, సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాల్లో బలమైన ముదిరాజ్ అభ్యర్థులు ఉన్నా టికెట్ ఇవ్వకుండా మొండి చేయి చూపారన్నారు. ముదిరాజ్ కులానికి చెందిన వారు కోట్లు ఖర్చుపెట్టుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు.

నోరు అదుపులో పెట్టుకో..

సంగారెడ్డి మున్సిపాలిటీ: మంత్రి హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావుపై బీఆర్ఆర్ నేతలు మండిపడ్డారు. ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నేత చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. మైనంపల్లి వ్యాఖ్యలు పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయన్నారు. ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించమన్నారు. ఎమ్మెల్యే క్రాంతి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి మంత్రి హరీశ్ పాత్ర ఎనలేనిదని, అలాంటి వ్యక్తిపై మైనంపల్లి నోరు పారేసుకోవడం తగదన్నారు. రాష్ట్రంలో హరీశ్‌రావు ఎక్కడ పోటీ చేసినా లక్ష మెజారిటీ వస్తుందన్నారు. మైనంపల్లి హన్మంతరావు పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే మాణిక్ రావు, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ భిక్షపతి, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి , నాయకులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో విజయ సంకేతం చూపుతున్న నేతలు

క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే



మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పటాన్‌చెరు అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవార్లకు ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పూజలు

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని అంతారం గ్రామంలో జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతా మూర్తులతో పాటు జీవన్ముక్త మహారాజ్‌ను సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సోమవారం దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ తనకు రెండోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

జిన్నారం(పటాన్‌చెరు): పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్పబస్తీ, 11వ వార్డులో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయ కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

కొండాపూర్(సంగారెడ్డి): ఏవైనా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అవగాహనతో ఎదుర్కోవాలని నేషనల్ డీసీజ్ రిజిస్ట్రేషన్ సర్వీసు కమిటీ కమాండర్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్‌కుమార్ అన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విపత్తుల స్పందన విభాగం సహకారంతో విద్యార్థులకు ప్రకృతి విపత్తులపై సామాజిక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మనీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలైన వరదలు రావడం , కొండ చరియలు విరిగిపడడం, భూమి కంపించడం, ప్రమాదాలు జరిగి రక్తం కారడం వంటి సమయాల్లో ప్రతిఒక్కరూ ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా గుండెపోటుకు గురైనప్పుడు వారికి సీపీఆర్ చేసే విధానాన్ని ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సీతారామరాజును ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం సన్మానించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా డాక్టర్ సీతారామరాజుకు ఉత్తమ డాక్టర్ అవార్డు వచ్చింది. ఈ మేరకు ముదిరాజ్ సంఘం నాయకులు మాజీ సర్పంచ్ కొండపురం నర్సింహులు, దయాకర్, రాచన్నలు డాక్టర్‌కు శాలువ పూలమాలలతో సన్మానించి స్వీట్స్ తినిపించారు.

గీతం అధ్యాపకుడికి డాక్టరేట్

పటాన్‌చెరు టౌన్: అల్యూమినియం/గ్రాఫైట్ లోహ మిశ్రమాల సంశ్లేషణ-సూక్ష్మ నిర్మాణం-యాంత్రిక లక్షణాలు, వాటి ప్రవర్తన అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అట్ల శ్రీధర్‌కు డాక్టరేట్ వరించింది. (సుల్తాన్ పూర్)లోని జేఎన్‌టీయూహెచ్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న లక్ష్మి ఈ పరిశోధనను పర్యవేక్షించినట్టు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో గీతం యాజమాన్యం వెల్లడించింది.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు ఐదు శాతం కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌పీఆర్డీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట వికలాంగులు సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పుల్కల్ మండల అధ్యక్షులు రామచందర్, నాయకులు, వట్‌పల్లి, పుల్కల్, మునిపల్లి, అందోల్ మండలాలకు చెందిన వికలాంగులు పాల్గొన్నారు.

దివ్యాంగులు నిరుత్సాహపడొద్దు

- విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి
- టీఎస్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్ చింతా ప్రభాకర్



విద్యార్థులకు సహాయ ఉపపరికరాలు అందజేస్తున్న చింతా ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): దివ్యాంగులు నిరుత్సాహపడకుండా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని టీఎస్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల దివ్యాంగ విద్యార్థులకు వివిధ రకాల సహాయ ఉప పరికరాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 27 మండలాల నుంచి 225 మంది దివ్యాంగులకు 314 కిట్లు అందజేసినట్లు వివరించారు. దివ్యాంగ విద్యార్థులకు అన్ని రకాల ఫిజియోథెరపి, ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్టు సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, సైన్స్ అధికారి విజయ్‌కుమార్, ఐఈఆర్పీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ..

కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉన్నతికి సంబంధించి 14 మండలాల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ప్రారంభమైనట్లు డీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శిక్షణలో మొదటి విడతవారికి మూడు రోజులు ఉంటుందని, రెండో విడత 13 మండలాలకు సంబంధించి శిక్షణ ఉంటుందని తెలిపారు. మొదటి విడత శిక్షణలో 120 మంది పాల్గొన్నారని తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముత్తంగి గ్రామంలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో రూ.3.50కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు దశలవారీగా నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, వైస్‌ఎంపీపీ స్వప్నశ్రీనివాస్, ఆత్మకమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మహంకాళి దేవాలయంలో సోమవారం వేంకటేశ్వర భక్త బృందం నిర్వాహకులు, సభ్యులు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సపనదేవ్ పాల్గొన్నారు. అనంతరం తిరుమల పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో భాస్కర్, శ్రీనివాస్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, రాజశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రకాష్‌రావు



మాట్లాడుతున్న ప్రకాష్‌రావు

సదాశివపేట(సంగారెడ్డి): హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రకాష్‌రావు అన్నారు. పట్టణంలోని సిద్దాపూర్ కాలనీలో సోమవారం పూరిగుడిసెల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రకాష్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి పేదలపై ప్రేమ ఉంటే ఎక్కడైతే పూరి గుడిసెలు వేసుకున్నారో వారిని గుర్తించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ ఇప్పుడు దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి వంటి కొత్త పథకాల ఆశ చూపి అధికారంలోకి రావాలని, ఈ హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా కార్యదర్శి తాజోద్దీన్, సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద, జిల్లా నాయకులు రహమాన్, షఫీ, సాదిక్‌అలి, ముస్తాఫా, బుజ్జమ్మ, పులమ్మ, అనసూజ, యాకూబ్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం విద్యుత్ ఇంజినీర్‌లకు నివాళి

పుల్‌కల్(అందోల్): శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదాఘాతుకానికి గురై మృతి చెందిన ఇంజినీర్లకు సింగూరు జలవిద్యుత్ కేంద్రం ఇంజినీర్‌లు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరులైన ఇంజినీర్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఏడీఈలు పాండయ్య, సౌజన్య, రాదిక, విద్యుత్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బీబీఏ కోర్సుపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రారంభించిన బీబీఏ (బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సుపై కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా రాస్కి (రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) సౌత్ ఇండియా రీజినల్ హెడ్ వడ్డె చందన హాజరై విద్యార్థులకు బీబీఏ రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రాస్కి అకడమి శ్రీకాంత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అల్లం రెడ్డి, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ రాజిరెడ్డి, కళాశాల ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి క్రిష్ణా, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్మీ శిక్షణ కేంద్రం సందర్శన

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని రాయిపల్లిలో భవిశ్యభారత్, ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువకులకు ఆర్మీ సెలక్షన్ ఎంపికకు సంబంధించి ఉచిత శిక్షణ కేంద్రాన్ని మాజీ లెఫ్టినెంట్ జనరల్ హరిప్రసాద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్మీలో ఎంపిక కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. వారికి సెలక్షన్‌లో ఎంపిక చేసే విధానం వివరించారు. యువకులు తీసుకోవాల్సిన జాగ్రతలు, మెళుకువలను తెలియపర్చారు. అనంతరం యువకులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. సర్పంచ్ రాంచందర్, నిర్వాహకులు రమేశ్, డాక్టర్ జయంత్, డిప్యూటీ డైరెక్టర్ హేమంత్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

- తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి



సమ్మెకు మద్దతు తెలుపుతున్న తుల్జారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వం సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యూలర్ చేయాలని టెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఏఎన్‌ఎంల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తుల్జారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మెడలు వంచైనా సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేసేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అనేక రాష్ట్రాల్లో ఎన్‌ఎంసీ స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను రెగ్యులర్ చేశారని, కానీ.. తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు రెగ్యూలర్ చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు ప్రధాన కార్యదర్శి బోయిన ప్రసాద్, సహాయ కార్యదర్శి లక్ష్మి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్యామల, ఏఎన్‌ఎంలు రోజీ, మేఘన, కౌంటాన్, పుష్ప లత, కమలమ్మ, సునీత పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కొండాపూర్(సంగారెడ్డి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడేళ్లుగా రూ.51,77కోట్ల విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యాసంస్థలు ప్రారంభమై రెండు నెలలు దాటినా పాఠశాల, కళాశాల విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, గురుకులాలు, కేజీబీవీల విద్యార్థులకు నోట్‌బుక్కులు సరిపడ రాలేవన్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో తొలగించిన స్కావెంజర్‌లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలో ఖాళీగా ఉన్న టీచర్ లెక్చరర్, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు సతీష్, సహాయ కార్యదర్శులు రజినీకాంత్, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జహీరాబాద్ టౌన్: గుర్తు తెలియని కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన నాగేందర్ తన బైక్‌పై హైదరాబాద్ నుంచి జహీరాబాద్ పట్టణం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో నాగేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియన కారు ఆపకుండా వెళ్లిపోయిందని బాధితుడు తెలిపాడు.

వ్యక్తి అదృశ్యం



నర్సింహులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమైన సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో నివాసం ఉండే నర్సింహులు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఈ నెల 14వ తేదీన ఎప్పటిలాగే కూలిపనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిన నరసింహులు ఎంతకూ తిరిగిరాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఆరా తీశారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో రైతు విభాగం మండలాధ్యక్షుడు మృతి



రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి మృతికి సంతాపం ప్రకటించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 19 మందిని మద్యం సేవించినట్టుగా గుర్తించి వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. దీంతో జడ్జి 16 మందికి రూ.2వేల చొప్పున, ఇద్దరికి రూ.3వేల జరిమానా, మరో వ్యక్తికి రూ.5 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండాలి

సంగారెడ్డి టౌన్: హోమియోపతి చదివే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు అన్నారు. సోమవారం సంగారెడ్డి మండలంలోని ఎంఎస్‌ఆర్ హోమియోపతి కళాశాలలో నిర్వహించిన జి20 సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ టైంలో చాలాదేశాలు హోమియోపతి మందులే వాడాయన్నారు. అల్లోపతి మందులు తొందరగా ప్రసంగం ఇచ్చిన హోమియోపతి మందులు మెల్లగా వాడినా మంచి ఫలితాన్ని ఇస్తాయని వివరించారు. సదస్సులో కళాశాల వైస్‌చైర్మన్ రవివర్మ, ఎమ్మెన్నార్ హోమియోపతి కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, లెక్చరర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న జెడ్పీ సీఈవో, నీలం మధు

సంగారెడ్డి టౌన్ : భావితరాలకు కాలుష్యరహిత సమాజం అందించేందుకు పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని జెడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురం ఆలయ అవరణంలో సోమవారం డీసీబీ బ్యాంక్ అధ్వర్యంలో సంకల్పతరపు ఫౌండేషన్ సహకారంతో 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత నీలం మధు, కందాడై వరదాచార్యులు లక్ష్మీనారాయణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... రామచంద్రపురం పరిధిలోని ఈదురు నాగులపల్లికి చెందిన ప్రవీణ్ (28) మద్యానికి బానిస అయ్యాడు. ఎప్పటిలాగే ఆదివారం ఇంట్లో అందరు భోజనం చేసి పడుకున్నారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు సోమవారం ఉదయం లేచి చూసేసరికి ప్రవీణ్ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నారాయణఖేడ్‌లో..



సదాశివపేట పట్టణంలో..



సదాశివపేట పట్టణంలోని దుర్గభవాని మందిరంలో..

అంబరాన్నంటిన సంబురాలు

రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడంతో జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల అనుచరులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

– సంగారెడ్డి న్యూస్ డెస్క్



జోగిపేటలో..

బీజేపీని బలోపేతం చేయాలి



కంది: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అవినాష్ సింగ్ పాటిల్ తదితరులు

జహీరాబాద్ టౌన్: బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కర్నాటక రాష్ట్రంలోని బీదర్ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే శైలేంద్ర బెళదలే అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రంజోల్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, నాయకులు సుదీర్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కంది(సంగారెడ్డి): ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ పాట్నా ఎమ్మెల్సీ అవినాష్ సింగ్ పాటిల్ ఆరోపించారు. సోమవారం కందిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో విధాన్ సభ ప్రవాస్ యోజన వర్క్ షాప్ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం రాములు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం

కొండాపూర్(సంగారెడ్డి): రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని పాట్నా బీజేపీ ఎమ్మెల్సీ అవినాష్‌సింగ్ పటేల్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం విధాన్ సభ ప్రవాస్ యోజన వర్క్‌షాప్ పరిశీలకుడిగా విచ్చేసిన ఆయన కంది మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేశ్‌పాండే, త్రిమెన్ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కనుమరుగవడం ఖాయం

నారాయణఖేడ్: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కనుమరుగవడం ఖాయమని కర్ణాటకలోని బసవ కల్యాణ్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే శరణుసలగార్ అన్నారు. నారాయణఖేడ్‌లోని లోటస్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేడ్ నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రవికుమార్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, మారుతిరెడ్డి, సాయిరాం, పత్తిరి రామకృష్ణ, సంజీవ్‌పటేల్, పట్నం మాణిక్యం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



నారాయణఖేడ్‌లో...



జహీరాబాద్: దత్తగిరి కాలనీలోని నాగదేవత ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా నాగుల పంచమి పండగను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో నాగదేవతకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిటలాడాయి.

– సంగారెడ్డి న్యూస్ డెస్క్